సాక్షి
ప్రకాశం

బుధవారం । 11 । జనవరి । 2023



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండే

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని కలెక్టర్ దినేష్ కుమార్ డీఆర్‌డీఏ ఉద్యోగులను హెచ్చరించారు. - IIలో..



దొంగలు బాబోయ్ దొంగలు

గిద్దలూరు పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ చేసి పోలీసులకు సవాల్ విసిరారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
29 /18

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం



జెడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జిల్లా పరిషత్ నుంచి జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, జామెంట్రీ బాక్సు తదితరాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు విడుదలచేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ జెడ్పీ చైర్మన్‌ను సత్కరించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయి సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఇటీవల మృతిచెందిన పర్చూరు జెడ్పీటీసీ కొల్లా గంగా భవానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య వైద్యం, మహిళా శిశు సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. వ్యవసాయ సంబంధిత వ్యవహారాలపై వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ అధ్యక్షత వహించగా, మహిళా, శిశు సంక్షేమానికి కొండపి జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నేడు

కనిగిరి రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని ఓల్డ్ ప్రకాశం జిల్లా నాన్ మెడలిస్ట్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో బుధవారం జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నమోదు చేసుకోవాలన్నారు. సాయంత్రం 6 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు లోకేష్ సెల్ 6304025689కు సంప్రదించాలన్నారు.

నిజమైన క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటారు

టంగుటూరు: నిజమైన క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటారని, వారు బాగా ఆడి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా స్పోర్ట్సు చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా శాప్ లీగ్ షూటింగ్ బాల్ సెలక్షన్స్ రాజరాజేశ్వరి మంగళవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సెలక్షన్స్‌కు జిల్లా నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆటలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం, వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీడీలు తులిబిలి అశోక్‌బాబు, మురళి, కిరణ్, వెంకట్రావు, మోహన్, చంద్రశేఖర్, ప్రభాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి కప్ విజేత హైదరాబాద్ టీం



విజేత టీంకు బహుమతిని అందజేస్తున్న చైర్మన్ చిర్లంచెర్ల కృష్ణ

మార్కాపురం: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళికృష్ణ అన్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రంలో మార్కాపురం స్పోర్ట్సు అండ్ యోగా క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పురుషుల డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ సంక్రాంతి కప్ విజేతలకు సోమవారం రాత్రి బహుమతులు అందజేశారు. క్రీడల ప్రోత్సాహానికి, క్రీడాకారులకు సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కృష్ణ కోరారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మిత్ర బృందం ఏర్పాటు చేసిన మొదటి బహుమతిని హైదరాబాద్ టీంకు అందజేశారు. కార్యక్రమంలో సీఐ భీమానాయక్, ఎంపీపీ పీ.అరుణ చెంచిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంది నారాయణరెడ్డి, ఉత్తమ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, స్పోర్ట్సు క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, పలువురు క్రీడాకారులు, పాల్గొన్నారు.

అదో మామిడి తోట..అక్కడ ఎన్నో వింతలు..విశేషాలు.. అక్కడికి వెళితే తిరిగి వెనక్కి రావాలనిపించదు. లోపలకు అడుగు పెట్టగానే రంగు రంగుల, రకరకాల కోళ్లు దర్శనమిస్తాయి. ఇక లోపలకు వెళితే కొక్కొరోకో కూతలు...ఒకటా, రెండా వందల సంఖ్యలో కోడి **పుంజులు,** పెట్టలతో ఆహ్లాదకరమైన వాతావరణంలోకి అడుగుపెట్టినట్టు **అనుభూతి** కలుగుతుంది. అది చెబితే తనివి తీరదు. ఆ ఆనందాన్ని కనులారా చూడాల్సిందే.. అక్కడి ప్రత్యేకతలు చెవులారా వినాల్సిందే.



- కోళ్ల ఉత్పత్తి కేంద్రంగా ''యరజర్ల''
- ప్రాచీన మెళకువలతో ఎంతో సున్నితంగా..
- ఇతర దేశాల కోడి జాతులతో సంపర్కం
- రెండేళ్లుగా విభిన్న పుంజు జాతుల ఉత్పత్తి
- ఆయుర్వేద మూలికలతో కూడిన స్టీమ్ బాత్
- దోమ తెరల మాటున రక్షణగా



పట్నాల రవిచంద్ర, ఒంగోలు డెస్క్
ఫొటోలు : ఎం.ప్రసాద్

అదిరే ఫుడ్డు.. విలక్షణ పోషణ

పుంజు భళా..



ఒంగోలు నగరానికి కూత వేటు దూరంలో యరజర్ల గ్రామం. 4 ఎకరాల్లో కోళ్ల ఫాం ఉంది. ఇక్కడ కోళ్ల పెంపకంలో ప్రత్యేకత ఉంది. మామిడి తోటలో ఉన్న ఈ వాతావరణాన్ని చూసి ఆశ్చర్యపోవాల్సిందే. విభిన్న జాతి రకాల కోళ్లు, కోడి పుంజులను చిన్న పిల్లల్లా వీటిని కంటికి రెప్పలా కాపాడుతూ పెంచుతున్నారు. వీటికి ప్రత్యేక గదులు. దుప్పట్లు.. దోమ తెరలు ఏర్పాటు చేశారు. వీటికి ఆయుర్వేద వనమూలికతో ప్రత్యేక స్నానం. మటన్ కీమా, బాదం, పిస్తా, తేనె, అంజూర్.. ఇలా బలవర్థకమైన ఆహారం. అనారోగ్యం పాలవకుండా మందులు.. ఇంకా ఎన్నో.. వీటిని సంరక్షించేందుకు నిత్యం పది మంది పనివారు. ఇక్కడ విదేశాల నుంచి తీసుకువచ్చిన కోళ్లు కూడా సందడి చేస్తాయి. ఎన్నో ఆసక్తి కలిగించే విషయాలు, విశేషాలు తెలుసుకుందామా మరి..

యరజర్లకు చెందిన టి.శ్రీనివాసరావు కోడి పుంజుల ఫాంను ఏర్పాటు చేశారు. ఇక్కడ పుంజులకు, బ్రీడర్లకు ప్రత్యేకంగా ఫాంలను ఏర్పాటు చేసి మరీ నిర్వహిస్తున్నారు. 20 ఏళ్ల నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, కృష్ణా జిల్లా నున్నలోనూ పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనంతరం రెండేళ్లుగా స్వగ్రామం యరజర్లలోని తన మామిడి తోటను కోడి పుంజుల ఉత్పత్తి కేంద్రంగా మార్చేశారు.

కుక్కుట శాస్త్రంలోనూ లేని విధంగా.. ఎన్నో మెళకువలు

గుడ్డు పెట్టించటం మొదలుకొని పొదిగి పిల్ల తయారు, వాటి పెంపకం ...అన్ని దశల్లోనూ ఎన్నో మెళకువలు. వాటికి బలవర్థకమైన ఆహారం ఇవ్వటం దగ్గర నుంచి ఆరోగ్య పరిరక్షణ వరకూ ఎన్నో జాగ్రత్తలు అన్నీ...ఇన్నీ కావు

స్పెషల్ మెనూ...



ఇక్కడ కోడి పుంజులకూ బలవర్థకమైన మెనూ ఉందండీ. బాదం, ఖర్జూరం, అంజూర్, యాలుకలు, రసగుల్లాలు, రంగు రంగుల ద్రాక్షలు, కిస్ మిస్, నాటుకోడి గుడ్డు.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాంతాడంత ఉంది.. వాటికి పరగడపున మొదలుకొని సాయంత్రం వరకు మెనూ సమయాన్ని పాటిస్తారు.

ప్రతి రోజూ 30 గ్రాముల లడ్డూ...

ప్రతి రోజూ ఒక్కో పుంజుకు ఉదయం 30 గ్రాముల లడ్డూ పెడతారు. బాదం, పిస్తా, అంజూర్, ఖర్జూరం, రెండు మూడు రకాల ఎండు ద్రాక్ష, సొంటి, సోంపు, గసగసాలు, జీలకర్ర, ధనియాలు, నువ్వులు, యాలుక్కాయలు, రసగుల్లలు, పిట్ట దంట్లు వీటన్నింటినీ కలిపి పచ్చడి బండపై రుబ్బు రోలుతో కచ్చపచ్చాగా నూరి సమపాళ్లలో తేనె వేసి లడ్డూలుగా తయారు చేస్తారు. ప్రతి రోజు ఉదయాన్నే 30 గ్రాముల చొప్పున ఒక్కో పుంజుకు తినిపిస్తారు. ఆ తరువాత ఉదయం 10 గంటల లోపు ఉడకబెట్టిన నాటుకోడి గుడ్డు ఇస్తారు. తర్వాత 30 గ్రాముల మటన్ కీమా..

- ✔ మధ్యాహ్నం ఒక్కో పుంజుకు నానబెట్టిన 8 బాదం పప్పు. వాటితో పాటు ఎండు ద్రాక్షలు, కిస్‌మిస్ ఒక్కోదానికి 10, ఆవుపాలలో నాన బెట్టిన అంజూర్‌ను తినిపిస్తారు. ఇంకా రకరకాల డ్రై ఫ్రూట్స్‌ను కూడా..
- ✔ సాయంత్రం ధాన్యం, రాగులు, సజ్జలు, చిలకడ గుండ్లు, పిట్టగుండ్లు లాంటి వాటిని సరిపడా ఇస్తారు.

మూడు నెలలకొకసారి ఆయుర్వేద స్నానం



ఆయుర్వేద మూలికలతో చేసిన నీళ్లు

కోడి పుంజుగా మూడు నెలల వయస్సు వచ్చేసరికి మొదటి ఆయుర్వేద స్నానం ప్రారంభిస్తారు. సాధారణంగా కోళ్లను నీటిలో వదలటం, ఈత కొట్టించటం సర్వసాధారణం. వాటితో పాటు శరీరం గట్టి పడటానికి, శరీరంలోని వృథా నీరు బయటకు పోవటానికి, ఉన్న కొవ్వు కరిగిపోవటానికి, శరీరం ''వజ్రకాయం'' కావటానికి దోహదపడేలా వాటిని తీర్చిదిద్దుతారు. అందుకే **ఆయుర్వేద స్నానం**తో పాటు స్టీమ్ బాత్ చేయిస్తారు.



తొలుత 50 లీటర్ల నీటిని తీసుకోవాలి. ఆ నీటిలో వెదురు ఆకు, వాయల ఆకు, నల్లతుమ్మ చెక్క, విప్ప పువ్వు, మోదుగు పువ్వు, పచ్చి పసుపు కొమ్ములు, మిరియాలు, స్పటిక, వాము, జాజికాయ, జాపత్రి, పచ్చ కర్పూరం కలిపి నీటిలో ఉడకబెట్టాలి. ఆ నీటిని 25 లీటర్ల వరకు వచ్చేలా మరిగించాలి. ఆ తరువాత కొంచెం చల్లనీళ్లలో కలిపి నులివెచ్చగా నీటిని తయారు చేసి ఆ నీటిలో పుంజును మూడు నుంచి ఐదు నిమిషాల పాటు ఉంచాలి. ఆ లను పిండి.. కింద ఒకటి, పైన ఒకటి గోనె సంచులు ఉంచి స్టీమ్ నీటిలో ముంచిన గోనె సంచు బాత్‌లాగా వాటిని అందులో ఉంచాలి. ఆ పొగల్లో నుంచి పుంజు శరీరంలోని వృథా నీరు కాస్తా బయటకు వెళ్లిపోతాయి. అరగంట సేపు ఆదమరిచి ఆ పుంజులు సొమ్మసిల్లుతాయి. అరగంట తరువాత ఆ గోనె సంచుల నుంచి వాటిని విడదీసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరల్లో ఉంచాలి. ఈ విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయుర్వేద స్నానం చేయిస్తారు. ఆ తరువాత మూడో రోజు షాంపూలతో స్నానం చేయించటం ఇలా ఎన్నో జాగ్రత్తలు. దీని ద్వారా శరీరంలో ఉన్న రుగ్మతలు కూడా దరిచేరవు. ఆరు నెలలపాటు ప్రత్యేక ర్యాక్‌లలో పెంచుతారు. వీటి కోసం ప్రత్యేక బెడ్‌లు, దోమ తెరలు ఉంటాయి. ప్రత్యేకంగా తీసుకొచ్చిన గంపలో వీటిని ఉంచి కంటికి రెప్పలాగా కాపాడుతారు. అనారోగ్యం పాలవకుండా మందులు ఇస్తారు. ప్రత్యేక టానిక్‌లు కూడా వేస్తుంటారు. అంతేకాదండోయ్ ప్రతి చెట్టుకూ సీసీ కెమెరాలు కూడా అమర్చారు.



కోళ్ల కోసం ప్రత్యేకంగా ఉంచిన మందులు

కొత్త జాతులు... ఇతర దేశాల జాతులతో సంపర్కం



ఇక్కడ రకరకాల కొత్త కోడి పుంజు జాతులను రూపొందిస్తున్నారు. భీమవరం కోడి పెట్ట జాతితో అరేబియా జాతి, ఆఫ్రికా జాతి, ఈము జాతి కోళ్లను సంపర్కం చేయించి మరీ కొత్త రకం జాతులను ఉత్పత్తి చేస్తున్నారు.

- అరేబియా జాతికి చెందిన పెట్టను రూ.70 వేలు వెచ్చించి మరీ ఇక్కడకు తెప్పించారు.







అరేబియాకి చెందిన మైల

- రూ.3 లక్షల విలువచేసే భీమవరం జాతికి చెందిన సీతువా బ్రీడర్‌తో కూడా పిల్లల ఉత్పత్తి.
- ఈము పక్షితో భీమవరం జాతి బ్రీడర్‌ను సంక్రమింపజేసి కొత్త రకం జాతి ఉత్పత్తి చేశారు.
- ఆఫ్రికా రకం కోడి కాకి జాతి బ్రీడర్ పుంజుతో మరో రకం ఉత్పత్తి.
- అరేబియా జాతి మైల రకం కోడి ఉంది.
- తెల్ల కొక్కెర పెట్టతో ఇతర జాతుల ఉత్పత్తి
- ఇతర దేశాల జాతి పెట్టలతో దేశీరకం జాతులతో సంపర్కం చేయించి మరీ చురుకైన జాతులను ఉత్పత్తి చేస్తున్నారు.



ఫాంలో వివిధ రకాల కోడిపెట్టలు, పుంజులు

ఆసక్తితోనే పెంపకం..



కోళ్లపై చిన్ననాటి నుంచి ఉన్న ఆసక్తితోనే వీటిని పెంచుతున్నాను. వీటికి ఖరీదైన పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా ఆరోగ్యంగా ఉండేలా నిత్యం జాగ్రత్తలు తీసుకుంటాం. పుంజులు, పెట్టలను విడివిడిగా ప్రత్యేక గదుల్లో ఉంచుతాం. విదేశాల నుంచి అరుదైన జాతులను తీసుకువచ్చి క్రాస్ బీడింగ్ చేస్తున్నాం. పాముల నుంచి రక్షించేందుకు ప్రత్యేకంగా వలలను కూడా ఏర్పాటు చేశాం.

– టీ శ్రీనివాసరావు, యర్లజర్ల

జగనన్న నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి

- రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ సురేష్



చెన్నంపల్లి ప్రభపై నుంచి మాట్లాడుతున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన రామ యోగయ్య తిరునాళ్ల సందర్భంగా మంత్రి సురేష్ పాల్గొని ముందుగా స్వామి వారిని దర్శించుకుని అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ నుంచి మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. పశ్చిమ ప్రాంత అభివృద్ధికి దోహదం చేసే వెలుగొండ ప్రాజెక్టు టీ–5 కాలువ పనులకు ప్రభుత్వం రూ.83.50 కోట్లు మంజూరు చేసిందని త్వరలోనే సీఎం శంకుస్థాపన చేస్తారని అన్నారు. ఈ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు రంగన్న పాలెం వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్‌కు కూడా శంకుస్థాపన చేస్తామని చెప్పారు. పొత్తులు లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్తామని.. 175 సీట్లకు 175 సీట్లు గెలిచి మళ్లీ జగనన్న సీఎం కావడం తథ్యం అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కల్లిబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించేందుకు నాయకులు వస్తున్నారని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జార్జి విద్యాసంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు కోటిరెడ్డి, ఏపీ బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్‌సింగ్, ఎంపీటీసీ లు రాములు, వెంకటరెడ్డి, నాయకులు రఘు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటిన కంభం విద్యార్థినులు

కంభం: ఈనెల 8, 9వ తేదీల్లో విశాఖపట్టణంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన జిమ్నాస్టిక్ పోటీల్లో స్థానిక వాసవీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బొట్ల రంగజయ చౌదరి రెండు బంగారు పతకాలు సాధించి ఆల్‌రౌండ్ చాంపియన్‌గా నిలిచింది. ఈ విద్యార్థిని గతంలో రాష్ట్ర స్థాయిలో 30, జాతీయ స్థాయిలో 4 చాంపియన్‌షిప్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె. రాము తెలిపారు. విద్యార్థిని మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామం కాగా ఇదే గ్రామానికి చెందిన మరో విద్యార్థిని కాకర్ల హరిష్మా చౌదరి ఈ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినులను కరస్పాండెంట్ గోళ్ల సుబ్బరత్నం, కోచ్ బొట్లా రంగనాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థినులు

విశ్రాంత ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మార్కాపురం టౌన్: విశ్రాంత ఉద్యోగులకు ఏ విధమైన సహాయం చేయటానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మున్సిపల్‌శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం పెన్షనర్ డే సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల భవనంలో మార్కాపురం యూనిట్ అధ్యక్షుడు ఐ.బాలసుబ్బారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి ముఖ్య అతిథిగా మాట్లాడారు. సుదీర్ఘ సేవలు అందించిన ఉద్యోగులకు ఆత్మగౌరవంతో ఎవరిమీద ఆధారపడకుండా పింఛన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని, వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. వారికి రావాల్సిన ఆర్థిక రాయితీలను కూడా అందిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగులను కూడా మెడికల్, విద్యా, రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల్లో అవకాశం ఉంటే విధుల్లోకి తీసుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంకా కొన్ని సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆల్‌ఫ్రెడ్, సంఘం సెక్రటరీ పి.జయరావు, నాగేశ్వరరావు, సభ్యులు జయపాల్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

మద్దిపూడి: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని గుండ్లసముద్రం సచివాలయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు వాకా సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.35 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.25 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.15 వేలు, ఏడో బహుమతి రూ.10 వేలు, ఎనిమిదో బహుమతి రూ.5 వేలు అందజేస్తామని వివరించారు. ఈ నెల 15న ఉదయం 7 గంటలకు ఎడ్ల యజమానుల సమక్షంలో డ్రా తీసి పోటీలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు 9490328505ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: జమ్ము కశ్మీర్‌లో గత నెల 23 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి స్కాయ్ మార్షల్ ఆర్ట్స్‌లో మార్కాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కె3(కట్టా) కేటగిరిలో పి.సాయి వెంకట శివ (కె-మిక్స్)లో సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం ఎం చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థిని తీర్చిదిద్దిన వ్యాయమ ఉపాధ్యాయులను, విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, పీడీ సోమశేఖరరెడ్డి, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, ముసలయ్య, వేణుగోపాల్, సమీఉల్లా, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండే

- డీఆర్‌డీఏ ఉద్యోగులను హెచ్చరించిన కలెక్టర్
- అంకెల గారడీతో మభ్యపెడితే సహించం
- మద్దిపాడు, పుల్లలచెరువు ఏపీఎంలపై చర్యలకు ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సబర్బన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్..డీఆర్‌డీఏ ఉద్యోగులను హెచ్చరించారు. స్థానిక టీటీడీసీ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగంపై ఆశలు వదులుకోవాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వీడి పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఆరా తీశారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, జగనన్న తోడు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ఉన్నతి, స్త్రీనిధి, సీడాప్, జగనన్న పాల వెల్లువతో పాటు ఇతర పథకాల అమలు తీరును మండలాల వారీగా సమీక్షించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని మెరుగైన జీవనోపాధి కోసం లబ్ధిదారులు వినియోగించుకునేలా పర్యవేక్షించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లకుండా అంకెల గారడీ చేస్తూ ఇష్టం వచ్చిన సమాచారాన్ని పై స్థాయికి నివేదిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మద్దిపాడు, పుల్లలచెరువు మండలాల ఏపీఎంలపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ బి.బాబురావును కలెక్టర్ ఆదేశించారు. పనితీరు పేలవంగా ఉన్న ఏపీఎంలందరికీ నోటీసులు జారీ చేయాలని పీడీని ఆదేశించారు. గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే డీఆర్‌డీఏ లక్ష్యమన్నారు. ఇందుకు విరుద్ధంగా ఏ స్థాయి అధికారి ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న లే అవుట్‌లలో స్థలాలు పొందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు అర్హతను బట్టి బ్యాంకు రుణాలు ఇప్పించడంతో పాటు ఇళ్ల నిర్మాణానికే వాటిని ఖర్చు చేసేలా పర్యవేక్షించాలని సిబ్బందికి, అధికారులకు సూచించారు. ఆసరా, చేయూత పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి ఆసక్తిని తెలుసుకొని మెరుగైన జీవనోపాధి కోసం పాడి పశువులు అందించడంపైనా దృష్టి సారించాలన్నారు. కిరాణా షాపులు, ఇతర వృత్తులు చేసుకుంటామని ముందుకు వచ్చే వారికి కూడా ఆ మేరకు సహాయం చేయటంతో పాటు వాటిని నిర్వహిస్తున్న తీరును పరిశీలించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయకుండా లబ్ధిదారులు ముందుకు రావడం లేదంటూ వారిపై నెపం మోపినా ఊరుకునేది లేదన్నారు. వచ్చే నెలలో మరోసారి ప్రత్యేకంగా సమీక్షిస్తానని, సిబ్బంది పనితీరులో పురోగతి కనిపించాలని సూచించారు. సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు, డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

పక్కాగా ల్యాండ్ ఆడిట్

- స్పందనకు ప్రతి అధికారి హాజరుకావాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టీకరణ



మండలస్థాయి అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: తహసీల్దార్లు ల్యాండ్ ఆడిట్ పక్కాగా చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించడంపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. 22-ఏ, చుక్కల భూములకు సంబంధించి రికార్డులను సరిచేసి అందజేయాలన్నారు. ఇంకా పంపిణీ చేయని ఇళ్ల పట్టాలను వెంటనే లబ్ధిదారులకు అందించాలని సూచించారు. డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించాలని చెప్పారు. రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఫొటో, ఖాతా నంబర్, ఆధార్, విస్తీర్ణం తదితర వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. తప్పులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరిచేయాలన్నారు. జనవరి 15వ తేదీ నుంచి అన్ని ఫైళ్లను ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని స్పష్టం చేశారు. ఫేస్ యాప్‌ను ఉద్యోగులందరూ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ హాజరు నమోదు తప్పనిసరి అని అన్నారు. మ్యుటేషన్ ప్రక్రియలో తిరస్కరణకు గురైన వాటిని ఆర్డీఓలు వెరిఫికేషన్ చేసి దరఖాస్తుదారునికి స్పీకింగ్ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. రహదారులు, రైల్వే లేన్లకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ చిన ఓబులేసు, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అమూల్యం

- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- 72 మంది దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఆపదలో ఉన్న వారికి రెడ్‌క్రాస్ సొసైటీ అందించే సేవలు ఎంతో అమూల్యమైనవని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతూ నడవలేని 72 మందికి రెడ్‌క్రాస్ తరఫున వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించారు. నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి కలెక్టర్ వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోటరీ, రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ ద్వారా ప్రస్తుతం రూ.4.2 కోట్ల విలువైన అత్యాధునిక రక్త పరీక్షా, రక్త కణాల సెగ్రిగేట్ పరికరాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. రెడ్‌క్రాస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థ సేవలు విస్తృత పరిచేందుకు సభ్యత్వాన్ని పెంచాలన్నారు. అందుకోసం సచివాలయ స్థాయిలో ఈ నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. దీంతో పాటు రెడ్‌క్రాస్ సేవలు కూడా ప్రజలకు మరింత దగ్గర కావాలన్నారు. పశ్చిమ ప్రాంతంలో ప్రజలు ఫ్లోరిసిస్ బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి వాటర్ గ్రిడ్ ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని చెప్పారు. ఏడాదిలోనే ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

మేయర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి రక్తం అవసరమైతే ముందుగా రెడ్‌క్రాస్ గుర్తుకు వచ్చేలా పనిచేయడం అభినందనీయమన్నారు. సేవా కార్యాక్రమాలు మరింతగా విస్తృతపరచాలని కోరారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ బాధితులకు మాత్రమే కాకుండా ఇతర కారణాలతో నడవలేని వారికి కూడా వీల్‌చైర్లు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తొలుత హెన్రీ డొనాల్డ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఔషధ గుణాలు కలిగిన రణపాల మొక్కలను కలెక్టర్ ఇతర అతిథులు రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నాటారు. సంస్థ వైస్ చైర్మన్ సీవీ రెడ్డి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి భగీరథీదేవి, రోటరీ ప్రతినిధులు రావి రవిశ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న మద్దిశెట్టి

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగి తాత ఆరాధన ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మంగళవారం ప్రారంభించారు. ఆరు పళ్ల విభాగంలో 12 జతల ఎద్దులు పోటీపడుతున్నాయి. బుధవారం న్యూ కేటగిరీలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాతల సహకారంతో బహుమతులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ నుసుం గోవిందరెడ్డి, ఫిషరీస్ సంస్థ స్టేట్ అడ్వయిజర్ షేక్ సైదా, ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, వైస్ చైర్మన్ కేసనపల్లి నాగేశ్వరరావు, ఎంపీటీసీ బుల్లం వెంకటనర్సయ్య, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, కురిచేడు సొసైటీ ప్రెసిడెంట్ మర్రి సుబ్రహ్మణ్యం, కల్లూరు సర్పంచ్ సక్కా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జననాయకుడు జగన్‌మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు తెలుసుకుని వారు అడగకుండా అవసరాలను సమకూర్చే జన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని పొట్లపాడు గ్రామంలో శ్రీ గుత్తికొండ రామయోగితాత ఆరాధన ఉత్సవాల్లో కొండా కోటిరెడ్డి, గ్రామస్తులు నిర్మించిన విద్యుత్ ప్రభను సందర్శించి ఆమె మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం నూరుశాతం నెరవేర్చిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఎంతమంది ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నారని ఆమె తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను సైతం మైమరపించేలా పరిపాలన దక్షత కలిగిన నాయకుడు వైఎస్ జగన్ ఒక్కరే అని దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. అవకాశం కోసం నాయకులు వస్తుంటారు, పోతుంటారని, పార్టీకి కార్యకర్తలే శాశ్వతమని అన్నారు. బాబుకి ప్రజల ప్రాణం కన్నా పబ్లిసిటీ పిచ్చి ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, కురిచేడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గోగులముడి లింగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్వీ నాగిరెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, నుసుం రమణారెడ్డి, నుసుం భాస్కరరెడ్డి, నుసుం రామకోటిరెడ్డి, అవుల వెంకటరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, నాగయ్య, చిరంజీవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి



ముగ్గులను పరిశీలిస్తున్న ఎస్పీ, జ్యూరీ కమిటీ సభ్యులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ

- ఎస్పీ మలికాగర్గ్
- జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళా పోలీసులు, హోంగార్డులు

ఒంగోలు: ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ సిబ్బందికి మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోటీలు ఉత్సాహంగా సాగాయి. మహిళా పోలీసులతో పాటు మహిళా హోంగార్డులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్పీ మలికాగర్గ్, జ్యూరీ సభ్యులుగా ఎస్పీ గారి అత్త సుమన్‌లతా జిందాల్, జేసీ సతీమణి ఎం ప్రత్యూష, అదనపు ఎస్పీ అడ్మిన్ సతీమణి కె.రమ్య ప్రియాంకలు హాజరయ్యారు. తెలుగు సంప్రదాయం ప్రతిబింబించేలా మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో సృజనాత్మకత, భావనాత్మకత, సందేశాత్మకను జోడించి ప్రతిభను చాటారని కొనియాడారు. సంక్రాంతి పండుగ అనగానే ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు, పిండివంటలు, తెలుగు సంప్రదాయాలు గుర్తుకు వస్తాయని పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు సంక్షేమంలో భాగంగా రానున్న నెలల్లో పోలీసు కుటుంబాలను ఒకచోట చేర్చి అనేక వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు జ్యూరీ సభ్యుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. మొదటి బహుమతి జిల్లా పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్ సత్యవాణి, రెండో బహుమతిని ఒంగోలు టూటౌన్ మహిళా కానిస్టేబుల్ పీవీ రమణ, మూడో బహుమతిని వి.శ్రీలక్ష్మి (హోంగార్డు) అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను కె.అనూష(సింగరాయకొండ),

ఎం.సరస్వతి(దర్శి), ఎన్.మల్లీశ్వరి(జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది), ఎం.వెంకటలక్ష్మి(మద్దిపాడు ఏఎస్సై), ఎ.ప్రియదర్శిని(వల్లూరు) అందుకున్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్ బాబు, డీపీఓ ఏఓ సులోచన, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు హరిబాబు, శ్రీహరిరెడ్డి తదితరులను ఎస్పీ అభినందించారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

- ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీలు
- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు
- పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు



సాయికృష్ణనగర్‌లో రసూల్ ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు



మార్కాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

గిద్దలూరు రూరల్: పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ చేసి పోలీసులకు సవాల్ విసిరారు. వరుసగా జరుగుతున్న దొంతనాలతో ప్రజలు బెంబేలెత్తుతుండగా దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

తాళాలు వేసిన గృహాలనే టార్గెట్‌గా చేసుకుని దొంగలు పథకం ప్రకారం చోరీలకు పాల్పడ్డారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న షేక్ రసూల్‌లో ఇంట్లో రూ.1.36 లక్షల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు అపహరించారు. అదే విధంగా ఆర్మీ జవాన్ ఇంటితో పాటు మరో మూడు గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఈ నాలుగు ఇళ్లలో బీరువాలు పగులగట్టి బంగారు ఆభరణాలు, నగదు, వెండి ఆభరణాలను అపహరించారు. అయితే నాలుగు ఇళ్ల యజమానులు అందుబాటులోకి లేకపోవడంతో ఎంత మేర చోరీకి పాల్పడిందో తెలియడం లేదు. ఒకేసారి 5 గృహాల్లో దొంగతనాలు జరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న సీఐ ఫిరోజ్, ఎస్సై బ్రహ్మనాయుడు సిబ్బందితో దొంగతనాలు జరిగిన గృహాలను పరిశీలించారు. బాధితుల వద్ద నుంచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వరుస దొంగతనాలతో హడల్..

గత నెల 25న నల్లమల ఘాట్ రోడ్డులో బంగారు వ్యాపారులను అడ్డగించి పెద్ద మొత్తంలో బంగారాన్ని అపహరించారు. అయితే కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా పోలీసు యంత్రాంగం అడిషినల్ ఎస్పీ శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో మూడు బృందాలుగా ఏర్పడి కేసును వారం రోజులల్లోనే చేధించి నిందితులను పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరచారు.

- డిసెంబర్ 30న గంగమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు చోరీ చేశారు.
- ఈ నెల 3న ఆంజనేయస్వామి ఆలయం, శివాలయాలల్లో చోరీలకు పాల్పడ్డారు. ఇలా వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతుండగా..పోలీసులకు దొంగలను పట్టుకోవడం సవాల్‌గా మారింది.

బోడపాడులో మూడు ఇళ్లలో చోరీ

మార్కాపురం: మండలంలోని బోడపాడులో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసిన నివాసాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వెన్న రామిరెడ్డి నివాసంలో రూ.4 వేల నగదు, రెండు ఉంగరాలు, ఆరెపల్లి సుబ్బమ్మ నివాసంలో రూ.2 వేల నగదు, ఐదు ఉంగరాలు, ఆరెపల్లి చిన లక్ష్మమ్మ నివాసంలో ఉంగరం, రూ.6 వేల నగదు అపహరించినట్లు రాత్రి 9 గంటల సమయంలో గుర్తించారు. వీరు మంగళవారం ఉదయం యధావిధిగా పొలం పనులు నిమిత్తం నివాసాలకు తాళాలు వేసుకుని వెళ్లారు. రాత్రి 8:30 గంటల సమయంలో ఇళ్లకు రాగా తాళాలు పగులగొట్టినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ డాక్టర్ ఎం. కిషోర్ కుమార్, సీఐ బీమానాయక్ గ్రామానికి వెళ్లి విచారించారు. ఇప్పటి వరకు 17 రోజుల వ్యవధితో పట్టణంలో పది దొంగతనాలు జరిగాయి.

క్లుప్తంగా

రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడి

నాగులుప్పలపాడు: రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడి చేసి బియ్యం పట్టుకున్నారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని ఉప్పుగుండూరులో ఓ రైస్‌మిల్లులో రేషన్ బియ్యం ఉన్నాయన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. మిల్లులో 25 కిలోల తూకం కలిగిన 560 బస్తాల బియ్యాన్ని గుర్తించారు. అవి రేషన్ బియ్యమా లేక మరేవైనా అనేది ఇంత వరకు అధికారులు ఎక్కడా సమాచారం ఇవ్వకపోవడంతో పట్టుకున్నవి ఏ బియ్యమో తేలాల్సి ఉంది.

రిమ్స్ క్వార్టర్స్ ఖాళీ చేయించాలి

ఒంగోలు అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా రిమ్స్ క్వార్టర్స్‌లో కొంతమంది ఉంటున్నారని, అటువంటి వారిని ఖాళీ చేయించి అర్హులకు కేటాయించాలని కోరుతూ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌కు పలువురు దళిత సంఘ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్వార్టర్స్ ఇవ్వడంతో ప్రభుత్వానికి నష్టం వస్తోందని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్‌ను కలిసిన వారిలో కొమ్ము సృజన్, చప్పిడి వెంగళరావు, దారా అంజయ్య ఉన్నారు.

నిందితుడికి శిక్షపడేలా చేసిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు

ఒంగోలు: గుడ్ ట్రయల్ మానిటరింగ్ నిర్వహిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేశారంటూ అధికారులు, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు. విద్యుత్ వైరు తప్పించే విషయంలో నిర్లక్ష్యంగా లారీని నడిపి క్లీనర్ మరణానికి కారణమైన డ్రైవర్‌కు మార్కాపురం న్యాయస్థానం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.రమేష్‌నాయుడు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. లారీ అన్‌లోడ్ చేస్తున్న సమయంలో అడ్డుగా ఉ్న పవర్ సబ్‌స్టేషన్ కేబుల్ వైర్లు లారీ క్లీనర్ తప్పిస్తున్నప్పుడు డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడిపి క్లీనర్ ఇలాసాగరం మల్లికార్జున మృతికి కారణమయ్యాడు. దీనిపై పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ కె.మాధవరావు కేసు నమోదు చేసి నిందితుడైన డ్రైవర్ జె.శ్రీనివాసరావు (గుంటూరు జిల్లా మాచర్ల మండలం విజయపురి సౌత్)ను అరెస్టు చేసి అభియోగపత్రం కోర్టులో దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొండపాటి గాంధీరెడ్డి నేతృత్వంలో నిందితుడిని కోర్టులో హాజరుపరిచి ఎస్పీ నేతృత్వంలో ట్రయల్‌లో సరైన సాక్ష్యాధారాలు సమర్పించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌కు శిక్షపడింది.

మహిళా రిజర్వేషన్ 33 శాతం సాధించుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని

ఒంగోలు: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ 33 శాతం సాధించుకోవాలని మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా సమితి నిర్మాణ సర్వసభ్య సమావేశం జరిగింది. స్త్రీవిద్య, బాల్య వివాహాల నిర్మూలన, స్త్రీల మరుగుదొడ్ల కోసం, ప్రతి గ్రామంలో ప్రసూతి కేంద్రం, వితంతువులకు పునర్వివాహాల కోసం అనేక పోరాటాలు మహిళా సమాఖ్య చేస్తోందన్నారు. ప్రస్తుతం మహిళలు విద్యారంగంలో దూసుకుపోతున్నారని, ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు ఏర్పడ్డాయన్నారు. బాల్య వివాహాలు కూడా తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. వితంతు వివాహాలు కూడా ప్రజలు ప్రోత్సహిస్తున్నారని, ముస్లిం మహిళలు సైతం భరణం సాధించుకుంటున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. 33 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ కోసం మాత్రం సాధించుకోలేకపోతున్నామని, 2024 సాధారణ ఎన్నికల నాటికి 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని ఆకాంక్షిస్తున్నామన్నారు. నరేంద్రమోడీ పాలనలో ధరలు భగ్గుమంటున్నాయంటూ విరుచుకుపడ్డారు. మహిళలు సంఘటితమైతేనే హక్కులు సాధించుకోగలమన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ మార్పు కోసం ప్రతి మహిళ ఉద్యమించాలన్నారు. పాలకులు చేస్తున్న మోసాలను గుర్తించి ప్రశ్నించాలన్నారు. సబ్సిడీల పేరుతో దోపిడీ జరుగుతోందని, మహిళలు వంటిళ్లకే పరిమితమైనంత కాలం వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వెంకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామమ్మ, ఉపాధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటికే న్యాయ సేవలు

- బాధితులకు అండగా న్యాయసేవ
- సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌బాబు



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న జడ్జి శ్యామ్‌బాబు



న్యాయమూర్తిని సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంపీపీడీవో, ఇతర అధికారులు

కొత్తపట్నం: న్యాయ సంస్థ మీ గుమ్మానికే వచ్చి తలుపు తట్టి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యామ్‌బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నల్సా ఆధ్వర్యంలో పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి రక్షణ, ట్రాడింగ్, కమర్షియల్ లైంగిక దోపిడీపై అవగాహన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వీరయ్య అధ్యక్షత వహించారు. తొలుత జడ్జి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ పేదరికంతో జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. పేదరికాన్ని నిర్మూలిస్తే ఇవన్నీ నివారించవచ్చన్నారు. ఇవన్నీ నిర్మూలించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల వార్షిక ఆదాయం రూ.3 లక్షలలోపు ఉంటే నల్సా ద్వారా వారికి ఉచితంగా సేవలు అందిస్తారని చెప్పారు. కుటుంబంలో అన్న, తమ్ముడు, అక్క, చెల్లులకు ఆస్తి తగాదాలు ఉంటే తమ ద్వారా కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. జైల్లో ఉండి అన్యాయంగా శిక్ష అనుభవిస్తూ ఉంటే వారికి కూడా న్యాయం చేసేందుకు న్యాయ సంస్థ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రీ లిటికేషన్..అని లోక్ అదాలత్‌లో పిటీషన్ వేస్తే అక్కడ గెలిస్తే అప్పీల్‌కు వెళ్లేందుకు కూడా అవకాశం ఉండదన్నారు. సుప్రీంకోర్టులో కూడా పిటీషన్ వేసుకునే అవకాశం ఉండదన్నారు. ఈ అవకాశం ఒక్క లోక్ అదాలత్ లోనే ఉందని జడ్జి శ్యామ్‌బాబు వివరించారు. కార్మిక శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు న్యాయ సంస్థ పరిష్కరిస్తుందన్నారు. కార్మికుడు పనిచేసి యజమాని డబ్బులు చెల్లించకపోయినా, శ్రమ దోపిడీ జరిగినా న్యాయ సంస్థ న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. బాల కార్మికుడితో పనిచేయిస్తే ఏడాది నుంచి 3 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.20 వేల అపరాధ రుసుం యజమానికి కోర్టు విధిస్తుందన్నారు. బాల కార్మికులు ఉంటే వెంటనే బడిలో చేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ పోర్టల్ ప్రవేశ పెట్టిందని, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అసంఘటిత కార్మికులు రూ.1.50 కోట్ల మంది ఉంటే ఇప్పటికే ఈ-శ్రమ పోర్టల్‌లో 75 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ రెవెన్యూలో పరిష్కారం కానివన్నీ న్యాయ సంస్థ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇటువంటి అవగాహన సదస్సులు పెడితే సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ మహిళలపై లైంగిక దోపిడీ జరగడం, బాలికలు అక్రమ రవాణా, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలించేందుకు శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, డ్వాక్రా మహిళలు, కార్మిక శాఖ, వైద్యశాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్టాల్స్‌ను జడ్జి పరిశీలించి అభినందించారు. అనంతరం మండల స్థాయి అధికారులు శాలువాతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. సీడీపీవో సీహెచ్ మల్లేశ్వరి, డాక్టర్ వైష్ణవి, ఏపీఎం రజియా సుల్తాన్ బేగం, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సూపర్‌వైజర్ డి.రాణి, పారా లీగల్ వలంటీర్ ఎస్.ఆంజనేయులు, ఎస్‌ఐ కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి.. తెలుగు వారి సంప్రదాయ పండగ



గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సంక్రాంతి సంబరాల్లో మేయర్ గంగాడ సుజాత, ప్రిన్సిపాల్ రఘురామ్

ఒంగోలు: సంక్రాంతి పర్వదిన వైభవాన్ని చిన్నారులకు వివరించేందుకు స్థానిక అన్నవరప్పాడులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూలు, భాష్యం లిటిల్ చాంప్స్ సిబ్బంది సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్లోని సంబరాలకు నగర మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై సంక్రాంతి వైభవాన్ని వివరించారు. తెలుగువారి సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే సంక్రాంతి ప్రతి ఒక్కరికి సంతోషదాయకమన్నారు. ప్రిన్సిపాల్ రఘురామ్, క్యాంపస్ ఇన్‌చార్జి రామారావు పాల్గొన్నారు. స్థానిక రాంనగర్ 5వ లైనులోని భాష్యం లిటిల్‌చాంప్స్‌లోనూ సంక్రాంతి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగిపళ్లు, చెరకుగడలు, పొంగళ్లు, కోలాటాలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు ఇలా ఒకటేమిటి అన్ని కళ్లకు కట్టినట్లు ప్రిన్సిపాల్ బోయపాటి సుశీల నిర్వహించారు.

నాగులుప్పలపాడు: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం సంక్రాంతి పండగ అని ఉప్పుగుండూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు అన్నారు. ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం యువకులు సంతోషంగా భోగి మంటలు వేసి పండగ చేశారు. సంక్రాంతి వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



భాష్యం లిటిల్ చాంప్స్‌లో భోగి మంటలు

నిడమానూరి లక్ష్మీనారాయణకు పద్మశ్రీ ఇవ్వాలి



త్యాగరాజస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న నాయీబ్రాహ్మణ ప్రతినిధులు

ఒంగోలు: ప్రముఖ డోలు విద్వాంసులు నిడమానూరి లక్ష్మీనారాయణకు పద్మశ్రీ ఇవ్వాలని నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏపీ నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజస్వామి ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్థానిక శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఉన్న త్యాగరాజస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కాపు కల్యాణ మండపంలో నాదనీరాజనం, నాదస్వరం, డోళ్లు 6 టీమ్‌లతో అత్యంత ఘనంగా మంగళ వాయిద్య నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్వాంసుడు, సాహితీవేత్త భూసరపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రముఖడోలు విద్వాంసులు నిడమానూరి లక్ష్మీనారాయణకు వందలాదిమంది వాయిద్య కళాకారులు, శిష్యులు ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత ప్రావీణ్యం సంపాదించిన మహనీయులన్నారు. ఆయనకు పద్మశ్రీ అవార్డుకు ఏపీ ప్రభుత్వం సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిల్లుట్ల సుధాకరరావు మాట్లాడుతూ కళ్యాణానికి వారధులైన మంగళవాయిద్యాలు అంతరించిపోకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మల్కాపురం కనకారావు, వందాడి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి బాల గురుస్వామి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దరణికోట లక్ష్మీనారాయణ, ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు గుంటూరు సత్యనారాయణ, గౌరవ సలహాదారులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమంచికి కాపు సంఘ నేతల అభినందనలు



ఆమంచిని సత్కరిస్తున్న కాపు నాయకులు

చీమకుర్తి: చీమకుర్తి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కాపు సంఘ నాయకులు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన ఆమంచి కృష్ణమోహన్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాలడుగు సుబ్బారావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, సూది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆమంచికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

పాస్టర్ల తొలి సమావేశం



మాట్లాడుతున్న పాస్టర్ శేఖర్‌బాబు

ఒంగోలు రూరల్: రూరల్‌లోని పాస్టర్ల తొలి సమావేశం మండలంలోని పాసకాలపాలెంలో పాస్టర్ ధనరాజ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి పాస్టర్ల సంఘ రూరల్ మండల అధ్యక్షుడు శేఖర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ రూరల్ గ్రామాల్లో ఇంకా కొంత మంది పాస్టర్ల సంఘంలో చేరాల్సి ఉన్నారని, ఆసక్తి ఉన్న వారు యూనియన్‌లో చేరాలని పిలుపునిచ్చారు. రానున్న దినాల్లో పాస్టర్లంతా ఐక్యంగా ఉంటే క్రైస్తవ సమాజానికి మేలు కలుగుతుందని తెలిపారు. యూనియన్‌లో చేరదలుచుకున్న వారు 99595 90744 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మహిళ అదృశ్యం

కొత్తపట్నం: మహిళ అదృశ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం డీటీ కాలనీకు చెందిన యాకసిరి నారాయణమ్మ ఈ నెల ఒకటో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి తండ్రి వెంకటేశ్వర్లు తెలిసిన చోటల్లా కుమార్తె కోసం వాకబు చేసినా ఫలితం లేదు. చేసేది లేక తండ్రి వెంకటేశ్వర్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈబీసీ, పీఎం-జేఏవై సర్వేలు పూర్తి చేయాలి

- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఈబీసీ, పీఎం-జేఏవై సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని గుడిమెళ్లపాడు వార్డు సచివాలయ సిబ్బందిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం గుడిమెళ్లపాడు వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలను ఏ విధంగా చేయాలో విశదీకరించారు. కరెంటు బిల్లులు కట్టించుకుంటున్న తీరును గమనించారు. సచివాలయానికి వచ్చే వారికి సంబంధించిన లామినేషన్ సర్వీసెస్‌ను ఏ విధంగా అందిస్తున్నారని నేరుగా వారితోనే మాట్లాడి తెలుసుకున్నారు. ప్రాపర్టీ ట్యాక్స్‌లు, వాటర్ ట్యాక్స్‌లు వసూలు చేస్తున్న విధానాన్ని కూడా గమనించారు. బర్త్, డెత్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు విషయంలో అలసత్వం విడనాడాలని హెచ్చరించారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోజూ సేవలు 25కు తగ్గకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా సచివాలయాల సిబ్బంది ఏకరూపు దుస్తులు తప్పనిసరిగా ధరించాలని కమిషనర్ ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పథకంలో భాగంగా యూజర్ చార్జీల వసూలు చేపట్టాలని సూచించారు. సచివాలయం పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కమిషనర్.. అడ్మిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మీ పని తీరు కూడా అదేవిధంగా ఉంటుందని భావించాల్సి వస్తుందని కూడా హెచ్చరించారు.

యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు

- హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ప్రధాన మంచినీటి పైపులైన్‌కు లీకులు
- వెంటనే మరమ్మతులు చేపట్టిన నగర పాలక సంస్థ అధికారులు



పనులు పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని భాగ్యనగర్ నాలుగో ప్రధాన రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద మంచినీటి పైపులైన్ పనులను నగర పాలక సంస్థ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఫిల్టర్ బెడ్ నుంచి వాటర్ ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ లీకవటం ప్రారంభించింది. గమనించిన నగర పాలక సంస్థ అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు పూనుకున్నారు. సోమవారం ఉదయం నుంచి ప్రారంభించిన పనులు మంగళవారం సాయంత్రం వరకూ కొనసాగాయి. ఎస్‌ఎస్ ట్యాంకు-1 నుంచి కొండమీద ఫిల్టర్ బెడ్‌కు నీటిని పంపిస్తారు. ఫిల్టర్ బెడ్ నుంచి ప్రధాన పైపులైన్ ద్వారా భాగ్యనగర్, రామ్ నగర్, సంతపేటలోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులకు (ఓహెచ్‌ఎస్‌ఆర్)ఈ పైపులైన్ ద్వారానే నీటిని నింపాల్సి ఉంది. హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ప్రధాన పైపులైన్ మలుపు వద్ద లీకవుతోంది. మలుపు వద్ద పైపులైనుకు గతంలో పైపులైన్‌ను సిమెంట్ కాంక్రీటుతో వేశారు. దీంతో పైనుంచి నీరు వేగంగా రావడంతో సిమెంట్ కాంక్రీటుకు పగుళ్లిచ్చి నీరు లీకు కావటం ప్రారంభించాయి. వెంటనే గుర్తించిన అధికారులు లీకుల వద్ద తవ్వి పరిశీలించారు. మలుపు పెద్దదిగా ఉండటంతో అక్కడ బలమైన స్టీలు పైపుతో జాయింట్ చేసేందుకు ప్రయత్నించారు. పైపులైనుకు వెల్డింగ్ చేసి మరీ జాయింట్ చేసేందుకు రెండు రోజులు పడుతోందని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొంటున్నారు. ట్యాంకులకు నీటిని ఎక్కించే పైపులైన్ కావటంతో పాటు సైజు పెద్ద పైపు కావటంతో జాయింట్ చేయటం కొంత కష్టంగా మారిందన్నారు. అయినా తమ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారన్నారు. బుధవారం ఉదయానికి ఫిల్టర్ బెడ్ నుంచి నీటిని భాగ్యనగర్, రామ్ నగర్, సంతపేటలోని వాటర్ ట్యాంకులకు ఎక్కిస్తామని కమిషనర్ వెల్లడించారు. తిరిగి అక్కడ మళ్లీ లీకులు రాకుండా పనులు నాణ్యతతో చేస్తున్నట్లు చెప్పారు. లీకుల విషయాన్ని గమనించి భాగ్యనగర్, రామ్ నగర్, సంతపేట ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశామని కమిషనర్ వెల్లడించారు. మున్సిపల్ ఇంజినీర్ కే.మాల్యాద్రి ఆధ్వర్యంలో డీఈలు పద్మజ, ఏఈలు, సిబ్బంది దగ్గరుండి మరమ్మతులు వేగవంతంగా చేపట్టారన్నారు. మేయర్ గంగాడ సుజాత పనులు పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆమెతో పాటు 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు ఉన్నారు.

సామాజిక కార్యకర్తల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధం కోసం పనిచేస్తున్న సంస్థలకు చెందిన సామాజిక కార్యకర్తల ఎంపిక కోసం అర్హులై, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.ఉదయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇద్దరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉండాలన్నారు. డివిజనల్ మాన్యువల్ స్కావెంజర్లకు సంబంధించి ఒంగోలు ఆర్డీవో అధ్యక్షతన ఏర్పాటుకానున్న డివిజినల్ విజిలెన్స్ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సహాయ సాంఘిక సంక్షేమాధికారి, ప్రగతిభవనం, ఒంగోలు కార్యాలయానికి పంపాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తప్పకుండా కులం, విద్యార్హత వివరాలు, చిరునామా, దరఖాస్తుకు ఒక ఫొటో, వారి యొక్క ఆధార్, ఓటరు కార్డులు, మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధం కోసం పనిచేస్తున్న సంస్థలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలన్నారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వా ఎటువంటి దరఖాస్తులు స్వీకరించేది లేదన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌కుమార్

అల్లూరు (కొత్తపట్నం): బాల కార్మిక వ్యవస్థ పూర్తిగా నిర్మూలించాలని జిల్లా ఉప కార్మిక శాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లూరు సచివాలయం-2లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల పిల్లలతో పనిచేయించట చట్టరీత్యా నేరమని, అత్యంత ప్రమాదకర పరిశ్రమలో 18 ఏళ్లు నిండని పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నిషేధమని వివరించారు. బాలలతో పనిచేయించే యజమానులకు ఒకటి నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలు బయట పనిచేస్తుంటే కార్మిక శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. సహాయ కార్మిక కమిషనర్ కె.పవన్‌కుమార్ (ఎస్‌ఎస్‌పీవో) బి.అనితవాణి (ఎస్‌ఎస్‌పీవో), ఒంగోలు సహాయ కార్మిక అధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

చీమకుర్తి మండలం రాజుపాలెం – లక్ష్మీపురం నివాసి అయిన **రామకోటయ్య** గారి భార్య **రమణమ్మ** యిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం రాజుపాలెం – లక్ష్మీపురం గ్రామ నివాసి లేటు **కడియం పెద రామయ్య** గారి కుమార్తు **కడియం సుబ్బయ్య** గారు 15-04-2016న పెద్దల సమక్షంలో నా క్లయింటు **అమ్మనబ్రోలు రామకోటయ్య** గారి భార్య **రమణమ్మ** వద్ద నుండి తీసుకున్న రొఖం రూ. **26,00,000/-** గాను (కుటుంబ అవసరాలు, బిల్డింగ్స్ నిర్మాణం కొరకు) Sy.135/6 లోని A.C. 0.07 Centes R.C.C. Building మరియు ఖాళీ స్థలం నా క్లయింటు పేరున స్వాధీన హక్కు పత్రం వ్రాయించి యిచ్చి ఉన్నారు. మరియు Sy.209/1 లోని A.C. 2.82 Centes మాగాణి పొలం, Sy.135/6 లోని A.C. 0.05 Cente ఉమ్మడి ఆస్తి అయ్యి ఉండి ఉన్నది. అందులకు గాను మా క్లయింటు తండ్రి గారి మరణానంతరం ఎటువంటి సంప్రదింపులు లేకుండగనే నా క్లయింటు ఇరువురు తమ్ముళ్ళు **(1) కడియం రామారావు (2) కడియం శ్రీనివాసులు** మా క్లయింటు ఉమ్మడి ఆస్తులను ఎటువంటి భాగ పంపిణీలు జరుపకుండగనే అన్యాక్రాంతం చేయువలెనని ప్రయత్నిస్తున్నారు. మరియు రెవిన్యూ రికార్డుల్లో నా క్లయింటు నుండి ఎటువంటి సంతకములు లేకుండ గానే Sy.209/1 లోని A.C. 2.82 Centes వారి భార్యల పేరున నమోదు చేయించి ఉండిఉన్నారు. పై తెల్పిన సర్వే నంబర్లలోని ఆస్తులలో నా క్లయింటుకు కూడా హిందూ వారసత్వ చట్టం, 1935 & 1956 ప్రకారం హక్కు ఉండి ఉన్నది. అక్రమ లాభార్జన కోసం షెడ్యూలు ఆస్తులకు సంబంధించి వివరాలు సృష్టించాలని నా క్లయింటును పలు విధాలుగా ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. షెడ్యూలు ఆస్తుల్లో వారికే కాక నా క్లయింటుకు కూడా హక్కు, స్వాధీనానుభవాలు ఉన్నాయని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది. ఇందు విషయమై ఎవరేమి లిటిగేషన్లు పెట్టినా అవేమి నా క్లయింటును ఏవిధంగాను బద్ధపరచవని తెలుసుకునేది. అట్టి వారందరూ నా క్లయింటు తీసుకొనబోయే అన్ని చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు :

Item No : 1 ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, రాజుపాలెం –లక్ష్మీపురం గ్రామ సర్వే నెం : 035/6, A.C. 0.05 Centes. **తూర్పు :** గ్రామ పంచాయితీ బజారు, **దక్షిణం :** కడియం పెద్ద వెంకటేశ్వర్లు గారి దాబా ఇల్లు, **పడమర :** మెదబలిమి మహాలక్ష్మమ్మ గారి ఖాళీ స్థలం **ఉత్తరం :** కడియం బ్రహ్మయ్య గారి శ్లాబ్ దాబా యిల్లు.

Item No : 2 ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, రాజుపాలెం- లక్ష్మీపురం గ్రామ సర్వే నెం : 145, A.C. 0.05 Centes. **తూర్పు :** రోడ్డు **దక్షిణం :** పూండ్ల పున్నయ్య గారి ఇల్లు **పడమర :** రోడ్డు **ఉత్తరం :** రోడ్డు.

Item No : 3 ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, రాజుపాలెం- లక్ష్మీపురం గ్రామ సర్వే నెం : 135/6 A.C. 0.07 Centes. **తూర్పు :** అలకుంట శ్రీను గారి ఇల్లు, **దక్షిణం :** రోడ్డు, **పడమర :** డబుల్ రోడ్డు, **ఉత్తరం :** నాగులూరి రంగయ్య గారి ఇల్లు.

Item No : 4 ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, రాజుపాలెం- లక్ష్మీపురం గ్రామ సర్వే నెం : 209/1 లోని A.C. 2.82 Centes మాగాణీ పొలం. **తూర్పు :** పమిడి వెంకటేశ్వర్లు, **దక్షిణం :** పుల్లగూర నారాయణ, **పడమర :** పానుగుపాటి రామయ్య, **ఉత్తరం :** రోడ్డు.

ఒంగోలు
తేది : 10-01-2023

DEGALA RAJENDRA PRASAD, Advocate,
Ongole. Cell : 9000866106

పండగ రద్దీ



స్కూల్స్‌కు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్న తండ్రి



స్కూల్స్, కాలేజీలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్ ఎక్కుతున్న విద్యార్థులు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్–2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్–వరేలా ద్వయం 6–3, 7–6 (7/4)తో రాబిన్ హాస్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్–వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11–2, 5–11, 2–11, 5–11, 13–11, 11–9, 11–8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13–11, 11–9, 11–6, 11–8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–19, 21–14తో యంగ్ ఎన్గా టింగ్–యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12–21, 21–17, 14–21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10–21, 8–21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్–కృష్ణప్రసాద్ ద్వయం 10–21, 18–21తో కాంగ్ మిన్ హుక్–సియో సెయంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19–21, 14–21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.



కోహ్లి సెంచరీ అభివాదం

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.



9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1–143, 2–173, 3–213, 4–303, 5–330, 6–362, 7–364. **బౌలింగ్:** కసున్ రజిత 10–0–88–3, మదుషంక 6–0–43–1, హసరంగ 10–0–67–0, కరుణరత్నే 8–0–54–1, దునిత్ 8–0–65–0, షనక 3–0–22–1, ధనంజయ 5–0–33–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–19, 2–23, 3–64, 4–136, 5–161, 6–178, 7–179, 8–206. **బౌలింగ్:** షమీ 9–0–67–1, సిరాజ్ 7–1–30–2, పాండ్యా 6–0–33–1, ఉమ్రాన్ 8–0–57–3, చహల్ 10–0–58–1, అక్షర్ 10–0–58–0.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్–జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్–త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పోర్వోరిమ్‌లో పాండిచ్చేరి–గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

మా ఇల్లే పాన్ ఇండియా

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..



శ్రుతీహాసన్

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతా దంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

సినిమా

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో... పది భారతీయ చిత్రాలు



ప్రతిష్టాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహా హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీర్ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్ (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీర్ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది

– ఎస్ఎస్ తమన్



''పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసూగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.



● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

నా కల తీరుతోంది

– సంతోష్ శోభన్



''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.